

- జిల్లా సరిహద్దులో ఆరు చెక్‌పోస్టులు
- ఆకస్మిక తనిఖీలు చేస్తున్న కలెక్టర్, ఎస్పీ
- ఈనెల 31 వరకు పోలీస్ యాక్ట్ అమలు
- జిల్లాలో 51 సమస్యాత్మక, 41 అత్యంత సమస్యాత్మక ప్రాంతాలు
- ఇప్పటికే 657 మంది బైండోవర్
- పంచాయతీ ఎన్నికలకు పటిష్ట భద్రత

# నిఘా నీడన పల్లె పోరు



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

గ్రామ పంచాయతీ ఎన్నికల కోరం అధికారులు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. పోలీసు నిఘా నీడలో ఎన్నికలు నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 12 మండలాల్లో 260 గ్రామాల్లో ఇప్పటివరకు కొన్ని పంచాయతీలు ఏకగ్రీవం కాగా మిగతా పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల పోరును ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటుంది. జిల్లాలో మూడు విడతల్లో జరిగే ఎన్నికల్లో తొలి విడతలో రుద్రంగి, చందుర్తి, వేములవాడ, వేములవాడ రూరల్, కోనరావుపేట, మండలాలు ఉండగా, రెండో విడత లో బోయిన్‌పల్లి, ఇల్లంతకుంట, తంగళ్ళపల్లి, మూడో విడతలో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి ముస్తాబాద్, గంభీరావుపేట మండలాల్లోని గ్రామాలకు ఎన్నికలు జరగనున్నాయి. మొదటి విడత నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తి కావడంతో అభ్యర్థులు ప్రచారంలో కుస్తీ పడుతున్నారు. రెండో విడత నామినేషన్‌లో ఉపసంహరణ శనివారం పూర్తికానుంది. మూడో విడత నామినేషన్ల ఉపసంహరణ 9వ తేదీ వరకు గడువు ఉంది. ఇప్పటికే గ్రామాల్లో ఎన్నికల వేడి మొదలు కాగా ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయడానికి జిల్లా యంత్రాంగం, ఎన్నికల ప్రచారం నుంచి పోలింగ్ వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు ప్రక్రియ ముగిసే విధంగా పోలీస్ యంత్రాంగం నిరంతరంగా నిఘా పెట్టింది. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**● అక్రమాలకు చెక్ పెట్టే దిశగా చర్యలు**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో అక్రమాలకు చెక్ పెట్టే విధంగా జిల్లా సరిహద్దుల్లో ప్రధానంగా ఆరు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. తంగళ్ళపల్లి మండలం జిల్లెళ్ల, గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజి, వేములవాడ రూరల్ మండలం ఫాజిల్‌నగర్, బోయినపల్లి మండలం నర్సింగాపూర్, రుద్రంగి మండలం మానాల క్రాస్ రోడ్, ముస్తాబాద్ మండలం వెంకట్రావుపల్లి చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. చెక్ పోస్టుల వద్ద జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బీ గితే ఆకస్మికంగా తనిఖీలు చేస్తూ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. చెక్‌పోస్టుల వద్ద స్టాటిక్, సర్వైలెన్సు బృందాలు, వీడియోగ్రాఫర్ ద్వారా నిరంతరం తనిఖీలను రికార్డ్ చేస్తున్నారు. రెండు షిఫ్టుల్లో అధికారులు విధులు నిర్వహిస్తున్నారు.

**● సమస్యాత్మక గ్రామాలపై పటిష్ట నిఘా**

సిరిసిల్ల జిల్లాలో 12 మండలాల్లో 51 సమస్యాత్మక ప్రాంతాలుగా 49 సున్నితమైన ప్రాంతాలుగా గుర్తించారు. సమస్యాత్మక గ్రామాల్లో గతంలో జరిగిన పార్లమెంట్, శాసనసభ, స్థానిక ఎన్నికల్లో జరిగిన ఘర్షణలు, సంఘటనలు రాజకీయ ఘర్షణలు అధ్యయనం చేసి ప్రస్తుతం తీసుకోవలసిన చర్యలపై దృష్టి పెట్టారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక భద్రతా చర్యలను తీసుకుంటున్నారు అవసరాన్ని బట్టి అదనపు బలగాలను సైతం వినియోగించే విధంగా దృష్టి పెట్టారు. ఇప్పటికే జిల్లాలో డిసెంబరు 31 వరకు పోలీస్ యాక్ట్ అమల్లోకి తెచ్చారు. ఇప్పటివరకు 659 మందిని బైండోవర్ చేశారు. ముందస్తుగానే 18 లైసెన్స్ తుపాకులను ఎస్పీ కార్యాలయంలో అప్పగించారు. గ్రామాల్లో రాజకీయ పార్టీల నాయకులకు ఎన్నికలు సజావుగా సాగేలా సహకరించే విధంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు.

**● నగదు, మద్యం నిలువలపై నజర్**

పంచాయతీ ఎన్నికల్లో నిబంధనలు ఖచ్చితంగా అమలు చేసే విధంగా అధికారులు దృష్టి సారించారు. సర్పంచ్, వార్డు సభ్యులు తమ గెలుపు కోసం ప్రధానంగా డబ్బులు, మద్యం వినియోగించడం సర్వసాధారణం. పోలీస్ యంత్రాంగం నగదు తరలింపు, మద్యం నిలవాలపై దృష్టి పెట్టారు జిల్లాలో ఇప్పటికే 209 లీటర్ల స్వాధీనం చేసుకున్నారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపె అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అభ్యర్థుల ఖర్చుకు పరిమితిని ఎన్నికల కమిషన్ విధించింది. ఐదు వేల జనాభాలోపు గ్రామాల్లో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థి రూ1.50 లక్షలు, వార్డు సభ్యుడు రూ 30వేలు, 5 లక్షలపైగా ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థి రూ 2.50 లక్షలు, వార్డు సభ్యుడు రూ 50 వేలు ఖర్చు పరిమితి ఉంది. ఎన్నికల సామగ్రికి లెక్క ఉంది. ఎన్నికల బరిలో ప్రచారానికి ఉపయోగించే సామగ్రికి లెక్క ఉంది. 76 రకాల సామగ్రికి రేట్లు ఎన్నికల సంఘం నిర్ణయించింది. రోజుకు లౌడ్ స్పీకర్ అద్దె 100 వాట్స్ రూ 500, వాట్స్

(మిగతా 8వ పేజీలో)



## లారీలు అందుబాటులో ఉంచాలి

**- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్

సిరిసిల్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలకు అనుగుణంగా లారీలు అందుబాటులో ఉంచాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. బోయినపల్లి, కోనరావుపేట మండలాలకు చెందిన కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, లారీల కాంట్రాక్టర్లతో శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు, నిలువలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసిన వెంట వెంటనే కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. ధాన్యం తరలించేందుకు లారీల కొరత లేకుండా చూసుకోవాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి చంద్ర ప్రకాశ్, డీఎం రజిత, డీసీవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలందించాలి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలోని ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలను అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఎన్‌సీడీ డేటాపై డాక్టర్ రజిత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రజిత, ఎన్‌సీడీ స్టేట్ కన్సల్టెంట్ డాక్టర్ సత్యేంద్ర నాథ్ మాట్లాడారు. ప్రభుత్వాల లక్ష్యాలను సకాలంలో సాధించాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎన్‌సీడీ స్టాఫ్‌నర్స్‌లు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఎంఎల్‌హెచ్‌పీలకు రక్తపోటు, మధుమోహం, గుండెకు సంబంధించిన వ్యాధులపై సమీక్షించారు. అనంతరం ఆన్‌లైన్ డేటాలో ఆధార్ లింక్‌తో ఆన్‌లైన్‌లో జనరేట్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఎన్‌సీడీ డేటాపై సందేశాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ రామకృష్ణ, వైద్యులు సంపత్‌కుమార్, అనిత, నయిమా, డీఎం కార్తిక్ పాల్గొన్నారు.

## సేవాలాల్ తండా పంచాయతీ ఏకగ్రీవం

ముస్తాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సేవాలాల్ తండా గ్రామపంచాయతీ జనరల్ మహిళకు కేటాయించగా సర్పంచ్ అభ్యర్థి భుక్య సరితరవితో పాటు, 8 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు. సర్పంచ్, వార్డుమెంబర్ స్థానాలకు సింగిల్ నామినేషన్లు పడ్డాయి. ఉపసంహరణ గడువు ముగియడంతో సేవాలాల్‌తండా గ్రామ పంచాయతీ ఏకగ్రీవమైంది. నూతన పాలకవర్గాన్ని పలువురు సత్కరించి అభినందించారు.

## రాష్ట్ర వాలీబాల్ జట్టు శిక్షణ శిబిరం ప్రారంభం



శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వాలీబాల్ జూనియర్స్ బాలబాలికల జట్ల శిక్షణ శిబిరాన్ని శుక్రవారం అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గుడ్ల రవి, ఉపాధ్యక్షుడు చింతికింది శ్యాంకుమార్ ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో ఏర్పాటుచేసిన తొమ్మిది రోజుల శిక్షణ శిబిరానికి శుక్రవారం సాయంత్రం రాష్ట్ర జట్టుకు ఎంపికైన 18 మంది బాలురు, 18 మంది బాలికలు హాజరయ్యారు. ఈనెల 13 వరకు కోచ్‌లు జీవన్, సంపత్‌కుమార్, జగన్ శిక్షణ ఇవ్వనున్నారు. ఈనెల 15 నుంచి 21 వరకు రాజస్తాన్ రాష్ట్రం పిలానీలో జాతీయస్థాయి వాలీబాల్ పోటీలు జరగనున్నాయి. బాలబాలికలకు స్టేడియంలో వసతి, భోజన సౌకర్యాలను కల్పించారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు బోయినపల్లి యువకుడు..



శ్రీకాంత్

బోయినపల్లి డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన గుంటి శ్రీకాంత్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక అయినట్టు రాజన్న సిరిసిల్ల కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ముస్కు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి సింగారపు తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. 51వ రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలు ఈనెల 5 నుండి 7వరకు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో జరిగే పోటీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా తరుపున పాల్గొంటాడని తెలిపారు. గుంటి శ్రీకాంత్ ఎంపిక పట్ల బోయినపల్లి గ్రామ ప్రజలు, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

## గుండెపోటుతో సర్పంచ్ అభ్యర్థి మృతి



చెర్ల మురళి(ఫైల్)

వేములవాడ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం చింతల్‌ఠాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన సర్పంచ్ అభ్యర్థి చెర్ల మురళి(50) గుండెపోటుతో మృతి చెందాడు. చింతల్‌ఠాణా ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ కాగా బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా చెర్ల మురళి నామినేషన్ వేసి బరిలో నిలిచారు. గురువారం అర్ధరాత్రి మురళికి గుండెపోటు రావడంతో చికిత్స కోసం వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడికి భార్య స్వరూప, కుమారుడు ఆదిత్య, కూతురు ఐశ్వర్య ఉన్నారు. కుమారుడు ఆదిత్య ఉపాధికోసం దుబాయ్ వెళ్లాడు. తండ్రి మృతిసమాచారం తెలుసుకొని స్వగ్రామానికి బయలుదేరాడు.

**యథావిధిగా ఎన్నికలు ..**

సర్పంచ్ అభ్యర్థి మురళి అకాల మరణం పొందినప్పటికీ ఈనెల 11న జరుగనున్న చింతల్‌ఠాణా సర్పంచ్ ఎన్నిక యథావిధిగా జరగనుంది. ఈ విషయమై ఎంపీడీవో స్పందిస్తూ చింతల్‌ఠాణాలో ఎన్నికలు కొనసాగుతాయని చెప్పారు. చింతల్‌ఠాణాలో సర్పంచ్ అభ్యర్థులుగా అయిదుగురు పోటీలో ఉన్నారు. ఇందులో మురళికి గుండెపోటు వచ్చి మృతిచెందడంతో కలెక్టర్ ఎన్నికల సంఘానికి నివేదిక సమర్పించగా ఎన్నికల యథావిధిగా నిర్వహించాలని ఆదేశించినట్లు వేములవాడ ఎంపీడీవో కీర్తన తెలిపారు.

## పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

ఇల్లంతకుంట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని సహాయ జిల్లా ఎన్నికల అధికారి శశికళ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామపంచాయతీ ఓటర్‌లిస్టులో పేరు ఉండి ఎన్నికల విధులలో పాల్గొనే ఉద్యోగులు, పోలీస్‌సిబ్బందికి మండలపరిషత్ కార్యాలయంలో ఈనెల 9, 10 తేదీలలో పోస్టల్ బ్యాలెట్ వేయాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు ఐడీకార్డు, ఎన్నికల ఆర్డర్ కాపీని తీసుకొని రావాలని సూచించారు.

## ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి స్థానిక నేవూరి రెడ్డి సంక్షేమ మాలీస్ పటేల్ సంఘం సభ్యులు రూ.25,116 లను శుక్రవారం విరాళంగా అందజేశారు. ఆలయ పునర్నిర్మాణానికి తమ వంతు నగదును వితరణ చేశామని పేర్కొన్నారు.

# నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి

**- ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్**

ముస్తాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా విధులను నిర్వర్తించాలని రాజన్న సిరిసిల్లా జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ప్రిసిడింగ్ అధికారులకు శిక్షణ, ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. పీపీటీ ప్రదర్శన ఇచ్చి ప్రతి అంశంపై వివరించారు. ఎస్ఈసీ ఆదేశాల ప్రకారం విధులు నిర్వర్తించాలని పోలింగ్ కేంద్రాలలో విద్యుత్ సరాఫరా, నీటివసతి వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇంక ఇతర సామగ్రి సరిచేసుకోవాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు కేటయించిన వాహనాల్లోనే ఎన్నికల సామగ్రిని తరలించాలని స్పష్టం చేశారు. పలువురు సందేహాలను నివృత్తి చేశారు. ముస్తాబాద్‌లోని నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట ప్రత్యేకాధికారులు అఫ్జల్ బేగం, రాఘవేందర్, ఎంఆర్‌వో రాంచందర్, ఎంపీడీవో లచ్చాలు, ట్రైనీలు తదితరులు పాల్గొన్నారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ గరిమ అగ్రవాల్

# మూడో విడతలో ముగిసిన నామినేషన్లు

**- సర్పంచ్ స్థానాలకు 612 మంది అభ్యర్థులు..**

సిరిసిల్ల, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో మూడో విడత నామినేషన్ల ఘట్టం చివరి రోజు జోరుగా సాగింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మూడో విడతలో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి,ముస్తాబాద్, గంభీరావుపేట మండలాల్లో 87 సర్పంచ్, 759 వార్డులకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ముగిసింది. చివరిరోజు రాత్రి 10.30 గంటల వరకు నామినేషన్లు స్వీకరించారు. చివరిరోజు సర్పంచులకు 213 నామినేషన్లు, వార్డులకు 759నామినేషన్లు వచ్చా యి. మొత్తం 87 సర్పంచ్ స్థానాలకు612 మంది అభ్యర్థులు. 762 వార్డు స్థానాలకు 1914 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మూడో విడతలో గంభీరావుపేట మండలంలో లక్ష్మీపూర్ సర్పంచ్‌గా అంజయ్యతో పాటు ఎనిమిది వార్డులు, దేశాయిపేట సర్పంచ్‌గా జి పద్మతో పాటు రెండు వారుల్డు, వీరలాల్ తండా భూక్య పద్మతో పాటు ఎనిమిది వార్డులు, ఏకగ్రీవమయ్యాయి. ముస్తాబాద్ మండలంలో సరితతో పాటు ఎనిమిది వార్డులు, ఎల్లారెడ్డిపేట మండలం రాగట్ల పల్లి సర్పంచ్‌గా లక్ష్మయ్యతో పాటు ఆరు వార్డులు, గుంటుపల్లి చెరువుతండా సర్పంచ్‌గా తిరుపతితో పాటు ఆరు వార్డులు, వీర్నపల్లి మండలంలో జవహర్ లాల్ నాయక్ సర్పంచ్‌గా భూక్య హంసతో పాటు ఎనిమిది వార్డులు ఏకగ్రీవమయ్యాయి. నామినేషన్ల పరిశీలన శనివారం ఈనెల 9వ వరకు గడువు ఉంది.

**తుది విడతలో చివరి రోజు నామినేషన్లు**

| మండలం | సర్పంచ్ | వార్డులు |
|---|---|---|
| ఎల్లారెడ్డిపేట | 69 | 274 |
| వీర్నపల్లి | 64 | 183 |
| ముస్తాబాద్ | 171 | 544 |
| గంబీరావుపేట | 80 | 302 |

## కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్

**- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన**



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

వేములవాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని నాంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న కొనుగోలు కేంద్రంను శుక్రవారం అదనపు కలెక్టర్ నగేష్ పరిశీలించారు. 'నెలరోజులుగా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అదనపు కలెక్టర్ నాంపల్లి సింగిల్ విండో ఆధ్వర్యంలో కొనసాగుతున్న కేంద్రాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిలువలను చూసి రైతులతో మాట్లాడారు. రైతుల వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో ఎంట్రీ వేగంగా పూర్తిచేసి ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. వారి వెంట తహసీల్దార్ రైతులు తదితరులు ఉన్నారు.

# నేల ఆరోగ్య పరిరక్షణలో జాగ్రత్తలు తీసుకోవాలి

**-జిల్లా వ్యవసాయ శాఖాధికారి అఫ్జల్ బేగమ్**

**- ఘనంగా ప్రపంచ మృత్తికా దినోత్సవం**

తంగళ్లపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నేల ఆరోగ్య పరిరక్షణలో ప్రతి రైతు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి అఫ్జల్ బేగమ్ సూచించారు. వ్యవసాయ కళాశాల దత్తత గ్రామం తంగళ్లపల్లి మండలం రాళ్లపేటలో ప్రపంచ మృత్తికా దినోత్సవం(హెల్త్‌సాయిల్ ఫర్ హేల్తీ సిటిస్) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వ్యవసాయ శాఖాధికారి మాట్లాడుతూ పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో ఆరోగ్య కరమైన నేలలు- ఆరోగ్యకరమైన పట్టణాల నిర్మాణానికి పునాది అన్నారు. వ్యవసాయ కళాశాల డీన్ సునీతదేవి మాట్లాడుతూ అర్బన్ ఫార్మింగ్, నేల ఆరోగ్యం ప్రాముఖ్యత గూర్చి వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయికుమార్, డాక్టర్ సంపత్‌కుమార్, డాక్టర్ అరుణ్ బాబు, ఇఫ్‌కో మేనేజర్ నరేష్‌లు నేల పరిరక్షణ, ఆధునిక పద్ధతుల వ్యవసాయం తదితర అంశాలను వివరించారు. అనంతరం రైతులకు నేల భూసార పరీక్ష పత్రాలను అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన వర్మీకంపోష్టు, నేలలకు సంబంధించిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎంఏవో సంజీవ్, సాయి కిరణ్, ఏఈవో అనుష, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.




రైతులకు నేల భూసార పరీక్ష పత్రాలు అందిస్తున్న అఫ్జల్ బేగమ్

# అభ్యర్థుల ఖర్చును పకడ్బందీగా నమోదు చేయాలి



మాట్లాడుతున్న అసిస్టెంట్ ఎలక్షన్ అబ్జర్వర్ అధికారి లచ్చయ్య

చందుర్తి డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారం కోసం అభ్యర్థులు చేసే ఖర్చును పకడ్బందీగా నమోదు చేయాలని అసిస్టెంట్ ఎలక్షన్ అబ్జర్వర్ లచ్చయ్య అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో చందుర్తి రైతు వేదికలో సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులకు ప్రచారంలో భాగంగా చేసే వ్యయం వివరాల నమోదు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో వ్యయ పర్యవేక్షణ ఎంతో ముఖ్యమని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఖర్చు విషయమై రిజిస్టర్లు నిర్వహించాలన్నారు. ప్రతి సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు ఈ ఎన్నికల వ్యయం కోసం ప్రత్యేక బ్యాంక్ ఖాతా ఓపెన్ చేయాలన్నారు. 5 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి వ్యయ పరిమితి రూ 2.50 లక్షలు, 5 వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి వ్యయ పరిమితి రూ1.50 లక్షలని వెల్లడించారు. అలాగే 5వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీ వార్డు అభ్యర్థి వ్యయ పరిమితి రూ50 వేలు, 5 వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామపంచాయతీ వార్డు అభ్యర్థి వ్యయ పరిమితి రూ 30 వేలని తెలిపారు. రూ 50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకువెళ్లవద్దన్నారు. ప్రతి అభ్యర్థికి సంబంధించిన రిజిస్టర్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డిస్ట్రిక్ ఎలక్షన్ అథారిటీ రాధా, సీఐ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ భూపతి, ఎస్సై రమేష్, ఎంపీవో ప్రదీప్, టీవోటీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## దత్తాత్రేయ స్వామిని ఆలయంలో మంత్రి పూజలు

**- ముగిసిన జయంతి ఉత్సవాలు**



స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు 7

## చివరి రోజు నామినేషన్ల వెల్లువ

**- రాత్రి వరకు కొనసాగిన స్వీకరణ**



తిమ్మాపూర్ క్లస్టర్ కేంద్రం వద్ద బారులుతీరిన అభ్యర్థులు 8

## వృద్ధ దంపతుల అనుమానాస్పద మృతి



నర్సింగాపూర్‌లో విచారిస్తున్న ఏసీపీ మాధవి

వీణవంక, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వీణవంక మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన సింగిరెడ్డి కొమురారెడ్డి(90), భార్య సింగిరెడ్డి చిలుకమ్మ(70) దంపతులు శుక్రవారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. వృద్ధదంపతుల కూతురు కొత్తిరెడ్డి సరోజన శుక్రవారం ఎప్పటిలాగే ఎలబాక నుంచి తల్లిదండ్రులను చూసేందుకు గ్రామానికి వచ్చింది. ఇంట్లోకి వెళ్లి చూడగా ఇద్దరు రెండు మంచాల్లో మృతిచెంది ఉన్నట్లు గుర్తించింది. ఇంటి పక్కన ఉన్నవారికి సమాచారం అందించింది. కొమురారెడ్డి కొంతకాలంగా అనారోగ్యానికి గురై మంచాన పడ్డాడని, జీవితంపై విరక్తిచెంది ఇద్దరు పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారని కూతురు సరోజన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. హుజురాబాద్ ఏసీపీ మాధవి సంఘటన స్థలానికి చేరుకొని విచారించారు. దంపతుల మృతదేహాలను పోస్టుమార్టమ్ కోసం జమ్మికుంట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు తెలిపారు.

## ఉరి వేసుకొని బీటెక్ విద్యార్థి బలవన్మరణం



అభినయ్‌సుదన్(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్సపల్లి గ్రామంలో ఓ బీటెక్ విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్ప డిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని కొక్కొండ రమేష్-రజితల కుమారుడు అభినయ్ సుదన్(19) మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం ఇంట్లోని బాత్రూంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు వెల్లడించారు. అభినయ్‌సుదన్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో పవర్‌లూం కార్మికుడి ఆత్మహత్య

తంగళ్లపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీకి చెందిన పవర్ లూం కార్మికుడు ఎల్లా రమేష్(41) ఆత్మహత్యకు చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. గతంలో రమేష్ పవర్‌లూం కార్మికుడిగా పనిచేశాడు. కొంత కాలంగా మద్యానికి బానిసై అందిన కాడికి అప్పులు చేశాడు. ఈ విషయమై భార్య లత మందలించడంతో ఈనెల 3వ తేదిన ఇంటి నుంచి వెళ్లిన రమేష్ మండల కేంద్రం శివారు మానేరు నదిలో దూకి ఆత్మహత్య చేసుకుని శుక్రవారం శవమై కనిపించాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



తొంటి రమేష్(ఫైల్)

కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగునూర్-జూబ్లీనగర్‌ల మధ్య నవంబరు 30న రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కరీంనగర్‌రూరల్ మండలం చామనపల్లికి చెందిన తొంటి రమేష్(20) చికిత్సపొందుతూ మృతిచెందాడని కరీంనగర్ రూరల్‌సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందగా తీవ్రంగా గాయపడిన రమేష్‌ను కుటుంబసభ్యులు హైదరాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడచికిత్స చేయిస్తుండగా శుక్రవారం మృతిచెందాడని తెలిపారు. మృతదేహానికి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసినకేసులో నిందితుడు మాడుపు నరసింహచారి(35)కి 20 సంవత్సరాలు జైలుశిక్ష విధిస్తూ జిల్లా మొదటి అదనపుసెషన్స్ న్యాయమూర్తి వెంకటేష్ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... బాలిక(11) ఏడవతరగతి చదువుతున్నది. బాలిక ఇంటిపక్కనే నిందితుడు మాడుగు నరసింహచారి తనతల్లితోకలిసి కిరాయి ఉంటున్నాడు. పక్కపక్కనే ఇల్లు ఉండడంతో బాధిత బాలిక తరచూ నిందితుడు నరసింహచారి ఇంటికి వెళుతుండేది. ఆ క్రమంలో అక్కడనే పడుకుంటూ ఉండేది. అదే అలుసుగా తీసుకున్న నిందితుడు బాలికకు మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. వయస్సువచ్చిన తరువాత వివాహం చేసుకుంటానని నమ్మించి రెండుసార్లు అత్యాచారం చేశాడు. ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడు. ఈ విషయం తెలుసుకున్న బాధితురాలి తల్లి నిందితుడి తల్లిని అడిగితే నాకొడుకుకు నీ కూతురును ఇచ్చి పెళ్లి చేయమని దబాయించింది. ఈ విషయమై సదరు బాధితురాలు 2022మార్చి 2న త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమేరకు పోలీసులు నిందితుడు నరసింహచారిపై భారతీయ శిక్షాస్మృతిలోని అత్యాచారం కేసుతోపాటు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. అప్పటి సీఐ శ్రీనివాసరావు కేసు విచారణజరిపి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి శరత్ కోర్టులో సాక్షులను హాజరు పరిచి వాదించారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి వెంకటేష్.. నింది తుడిపై కేసు రుజువుకావడంతో నిందితుడు మాడుపు నరసింహచారికి 20ఏళ్ల జైలు శిక్షతోపాటు వెయ్యిరూపాయల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పుచెప్పారు. ఈకేసులో సమర్థవంతంగా దర్యాప్తు జరిపి నిందితుడికి శిక్షపడేలా కృషిచేసిన అప్పటిఇన్‌స్పెక్టర్(ఏసీపీ) తుల శ్రీనివాసరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి శరత్, ఇతర పోలీసు అధికారుల బృందాన్ని పోలీస్‌కమిషనర్ అభినందించారు.

## బోరు మోటార్ల చోరీ

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రంలోని బోరు మోటార్ల మరమ్మతు దుకాణం నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బోరు మోటార్లను గురువారం రాత్రి అపహరించుకుపోయారు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని బంజేరు గ్రామానికి చెందిన బాబు మండలకేంద్రంలో బోరు మోటార్ల మరమ్మతు దుకాణం నడుపుతున్నాడు. మరమ్మతు కోసం రైతులు తీసుకు వచ్చినమోటార్లను దుకాణంలోంచి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. చోరీ ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు

- ఎన్నికల సమయంలోనే నియంత్రణ
- గ్రామాల్లో ఇష్టారీతిన మద్యం విక్రయాలు



కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు వెలుస్తున్నా ఎవరూ పట్టించు కోవడం లేదు. ఎన్నికల సమయంలో నియంత్రణ చేపడుతున్నా ఆ తర్వాత గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సాగుతున్నాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎక్సైజ్ శాఖ, పోలీసు శాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని మద్యం బెల్ట్ షాపులను మూసివేయిస్తున్నారు. గ్రామాల్లో, రోడ్ల పక్కన విచ్చలవిడిగా కిరాణాషాపులకు రెట్టింపు సంఖ్యలో మద్యం బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి, నిబంధనలకు విరుద్ధంగా 24 గంటల పాటు యథేచ్ఛగా మద్యం విక్రయాలు జరుపుతున్నప్పటికీ ఎక్సైజ్, ఇటు పోలీసుశాఖ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు పట్టించుకోవటం లేదు. మద్యం మత్తులో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతూ అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని నివేదికలు చెపుతున్నా బెల్టు షాపుల నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదు. బెల్ట్‌షాపులతో పోలీసులకు, ఎక్సైజ్ అధికారులకు ఆర్థికపరమైన లాభాలుం డటంతోనే వీటి పై కన్నెత్తి చూడటంలేదనే ఆరోపణలు వస్తున్నాయి.



రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు అత్యధిక ఆదాయం సమకూర్చిపెడుతున్న మద్యం అమ్మకాలపై ప్రభుత్వ వైఖరి కూడా చూసి చూడనట్లుగా ఉన్నది. ప్రజల ప్రాణాలకు భద్రత, రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వమే నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాగునీరు సైతం దొరకని గ్రామాల్లో అర్ధరాత్రి వేళ కూడా మద్యం చేయి చాచితే అందు బాటులో ఉండేలా గల్లీ గల్లీకి బెల్ట్‌షాపులు ఏర్పడ్డాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6 వేలకుపైగా బెల్ట్‌షాపులు మద్యం విక్రయాలను చేస్తున్నట్లు అంచనా.

**● ఎన్నికల వేళ అధికారుల తనిఖీలు**

ఎన్నికల సమయంలో పల్లెలు, గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఏర్పాటు చేయాలని ఎన్నికల కమిషన్ పోలీసుశాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల వేళ గ్రామాలలో రాజకీయ పార్టీలు, వర్గాల మధ్య గొడవలు జరుగకుండా, పల్లెల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలుగకుండా మద్యం విక్రయాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పోలీసుశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గ్రామాలలో బెల్ట్‌షాపులను పోలీసులు మూసివేయిస్తూ నిర్వాహకులను తహసీల్దార్‌ల ఎదుట బైండోవర్ చేస్తున్నారు.

**● ఆర్థికంగా చితికిపోతున్న పేద, కార్మిక కుటుంబాలు**

గ్రామాలు, పల్లెల్లో విచ్చలవిడిగా మద్యం బెల్ట్‌షాపులతో గ్రామీణ ప్రాంత పేదలు, కార్మికుల కుటుంబాల జీవనం కల్లోలంగా మారుతున్నది. గ్రామాలలో బెల్ట్‌షాపుల ఏర్పాటుపై కొన్ని ప్రాంతాల్లో మహిళలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో మహిళలు ఉద్యమిస్తూ మద్య నిషేధం తీర్మానం చేస్తున్నారు. గ్రామాభివృద్ధి కమిటీల పేరుతో గ్రామాలలో బెల్ట్‌షాపుల నిర్వహణకు అనధికారిక లైసెన్స్‌ల కోసం గ్రామ చావడిలో వేలం పాటలు నిర్వహించి షాపులను ఖరారు చేసుకుంటున్నారు. ఒక్కో షాపుకు లక్ష నుంచి 5 లక్షల రూపాయల వరకు కూడా పాడిన సందర్భాలు ఉన్నాయి. పల్లెల్లో మద్యం అమ్మకాల కారణంగా తమ కుటుంబాలు నాశనమైపోతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెల్ట్‌షాపుల ద్వారా నెలనెలా ఎక్సైజ్, పోలీసు అధికారులకు, అండగా నిలుస్తున్న రాజకీయ నాయకులకు లక్షలాది రూపాయల ముడుపులు ముడుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

## నాటుసారా పట్టివేత

గంభీరావుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం సముద్ర లింగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ముక్తానాయక్ తండాలో 5లీటర్ల నాటుసారాను పట్టుకున్నట్టు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. ముక్తానాయక్ తండాకు చెందిన బలరాం అనేవ్యక్తి గుడుంబా తయారు చేస్తున్నట్టు పక్కాసమాచారం మేరకు తనిఖీ చేయగా 5లీటర్ల నాటుసారా లభ్యమైనట్టు తెలిపారు. లభ్యమైన నాటుసారా సీజ్‌చేసి, బాధ్యుడైన బలరాంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వెల్లడించారు.

## రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా మానేరువాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద ఇసుక లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకుని, డ్రైవర్లపై కేసు నమోదు చేశామని, తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని సీఐ తెలిపారు.

## తహసీల్దార్ ఎదుట బైండోవర్

ఇల్లంతకుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. గ్రామాలలో మద్యం అమ్మేవారు, కేసులు ఉన్నవారు, ఉద్రిక్త పరిస్థితులు కల్పించే వారిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. శుక్రవారం బైండోవర్ చేసిన ఇద్దరితో కలిపి ఇప్పటి వరకు 183మందిని తహసీల్దార్ ఎదుట హాజరుపర్చినట్లు పేర్కొన్నారు.

## రోడ్డు పనులు చేపట్టాలని గ్రామస్థుల ఆందోళన



అన్నారంలో ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

మానకొండూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్-జమ్మికుంట డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా అన్నారంలో నిలిచిన రోడ్డు పనులను పూర్తి చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం అన్నారంలో ఆందోళన చేపట్టారు. వాహనాల రాకపోకలతో దుమ్ము ఇళ్లలోకి చేరుతోందని, ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎస్ఐ స్వాతి ప్రతీరోజు రోడ్డుపై నీరు పోసేలాచర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

# మానేరు చెక్‌డ్యామ్‌ను పేల్చివేశారు

- జల వనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ప్రకాష్



గుంపుల చెక్ డ్యామ్‌ను పరిశీలిస్తున్న ప్రకాష్

ఓదెల/జమ్మికుంట రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుంపుల తనుగుల మధ్య ఉన్న మానేరులో నిర్మించిన చెక్‌డ్యామ్ కూలిపోవడం నాణ్యత లోపం కాదని, ఇది ముమ్మాటికి పేల్చివేతేనని జలవనరుల శాఖ మాజీ చైర్మన్ ప్రకాష్ అన్నారు. నవంబర్ 21న, చెక్ డ్యామ్ పేల్చి వేసినట్లు ఫిర్యాదు చేయగా, 22న, ఎఫ్ఐఆర్ అయిందని, ఇప్పటివరకు కూడా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. శుక్రవారం నిజనిర్ధారణ కమిటీ ఆధ్వర్యంలో గుంపుల, తనుగుల చెక్ డ్యామును పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ, సంఘటన స్థలంలో జిలెటిన్ స్టిక్స్ దొరికినా, కొందరు నాణ్యతాలోపం అనడం విడ్డూరమని తెలిపారు. దిగువనున్న వావిలాల చెక్ డ్యామ్ నాణ్యతలోపం వల్ల కుంగిపోయిందన్నారు. ఇది మాత్రం కచ్చితంగా పేల్చివేతేనని తెలిపారు. నవంబర్ 21న, సంఘటన స్థలానికి సంబంధించిన ఇంజనీరింగ్ రవి కూడా పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారని, అనంతరం లేబలెటర్లో పరీక్ష చేసిన తర్వాత ఇది పేల్చినట్లు నిర్ధారణ అయిందని తెలిపారు. ఇసుకను అమ్ముకొని సొమ్ము చేసుకోవడానికి ఈ సంఘటనకు పాల్పడ్డట్లు తెలిపారు. రైతుల కోసం కట్టిన చెక్ డ్యాముల్లో కొంత మేరకే నష్టం వాటిల్లినప్పటికీ ఎక్కడ కూడా ఇలాంటి సంఘటనలు జరగలేదని తెలిపారు. వ్యవసాయ అభివృద్ధి కోసం కేసీఆర్ వందలాది కోట్లతో నిర్మించిన చెక్‌డ్యాములు రైతులకు ఉపయోగపడేవని, చెక్ డ్యామును పరిశీలించిన తర్వాత ఇది కచ్చితంగా పేల్చివేతేనని నిపుణులు కూడా తేల్చి చెప్తున్నారని అన్నారు. అయినా కూడా ఇప్పటివరకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని తెలిపారు.

కార్యక్రమంలో ప్రొఫెసర్లు సీతారామారావు, రాఘవరెడ్డి, జలవనరుల శాఖ మాజీఇంజనీర్లు దామోదర్‌రెడ్డి, వెంకటేశం శ్రీధర్ రావుదేష్ పాండే, వికాస జిల్లా అధ్యక్షుడు మల్లోజుల విజయ నంద్, వి.కా.స. ఎర్రోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో అగ్ని ప్రమాదం

- షార్ట్ సర్క్యూట్‌తో మంటలు
- 30క్వింటాళ్ల పత్తి దగ్ధం



షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన పత్తి

వేములవాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించి ఆస్తినష్టం జరిగిన సంఘటన వేములవాడ పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. పట్టణంలోని భగవంతరావునగర్‌కు చెందిన పెరుగు జలందర్ అనేరైతు ఇంట్లో పత్తిని నిల్వచేశాడు.

షార్టుసర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో సుమారుగా 20నుంచి 30క్వింటాళ్ల వరకు పత్తి అగ్నికి దగ్ధమైనట్లు తెలుస్తోంది. ఇంట్లో పత్తి నిల్వ ఎక్కువగా ఉండటంతో మంటలు క్షణాల్లో ఎగిసిపడ్డాయి. అదృష్టవశాత్తు ఇంటిలో ఎవరూలేకపోవడంతో ప్రమాదం తప్పింది. గమనించిన స్థానికులు వెంటనే అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు.

మంటలు చుట్టు పక్కలకు వ్యాపించకుండా నివారించడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. నష్టపోయిన రైతును అధికారులు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని స్థానికులు కోరారు.

## గడ్డిట్రాక్టర్ దగ్ధం



కాలిపోతున్న గడ్డి, ట్రాక్టర్

ఎలిగేడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డిలోడ్‌తో వెళ్లుతున్న ట్రాక్టర్‌కు ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. స్థానికుల వివరాల ప్రకారం.. సుల్తాన్‌పూర్‌లోని రేగులగడ్డ ప్రాంతం నుంచి శివపల్లికి గడ్డిలోడ్‌తో వెళ్లుతున్న ట్రాక్టర్‌కు అకస్మాత్తుగా మంటలు అంటుకున్నాయి. మంటలు ఒక్కసారిగా ఎగిసిపడటంతో డ్రైవర్‌గమనించి ట్రాక్టర్‌నురోడ్డుపై నిలిపివేశాడు. ఈ మంటల్లో గడ్డితోపాటు ట్రాలీ, ఇంజను, టైర్లు కాలిపోయాయని తెలిపారు.

# దొంగ అరెస్ట్..

- రూ.3,92,500 స్వాధీనం





దొంగను అరెస్ట్ చూపిస్తున్న డీఎస్పీ నాగేంద్రచారి

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తి డబ్బుల బ్యాగును దొంగిలించిన కేసులో బండారి బాలరాజును శుక్రవారం అరెస్ట్ చేసినట్లు సిరిసిల్లడీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. అతనిదగ్గర నుంచి రూ3లక్షల 92వేల 500లను రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో టౌన్‌సీఐ కృష్ణతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. వేములవాడ పట్టణానికి చెందిన నార్ల శ్రీనివాస్ అనే వ్యాపారి హైదరాబాదులోని హోల్‌సేల్ దుకాణాలకు చెల్లించాల్సిన రూ.3లక్షల92వేల500 నగదుతో పాటు ఇతరపత్రాలను బ్యాగ్‌లో ఉంచుకొని ఈనెల3న వేములవాడ బస్టాండ్‌వద్ద బస్సు ఎక్కాడు. కొంతసేపటి తర్వాత తనబ్యాగు కనిపించకపోవడంతో సిరిసిల్ల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీపుటేజీల ఆధారంగా నిందితుడిని వేములవాడ మండలం రుద్రారం గ్రామానికి చెందిన బండారి బాలరాజుగా గుర్తించి శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి మొత్తం నగదును రికవరీచేసి, రిమాండ్‌కు తరలించామని తెలిపారు. కేసును ఛేదించిన పట్టణసీఐ కృష్ణ, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది శ్రీనివాస్, నాగరాజు, రవికుమార్‌ను డీఎస్పీ అభినందించారు.

# అవినీతి నిర్మూలనకు కట్టుబడి ఉండాలి

- ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్

కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిర్మూలనకు సమాజంలోని ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండాలని, అప్పుడే అవినీతి నిర్మూలన సాధ్యమవుతుందని కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు కరీంనగర్‌లోని ఏసీబీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. డిసెంబర్ 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ అవినీతి నిరోధక వారోత్సవాలు నిర్వహించనున్నామని తెలిపారు. అవినీతి నిరోదకశాఖ ఆధ్వర్యంలో చేపట్టబోయే వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరమని చెప్పారు. అవినీతిపై 1064టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం క్యూఆర్ కోడ్‌ను విడుదల చేసిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కరీంనగర్ జిల్లాలో ఈ ఏడాది 32 కేసులు నమోదయ్యాయని తెలిపారు.

## కొనుగోలు కేంద్రం నుంచి 10 ధాన్యం బస్తాలు చోరీ

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం బావుసింగ్‌నాయక్‌తండాలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యం బస్తాలు శుక్రవారం చోరీకి గురయ్యాయని బాధిత రైతు భూక్య సురేశ్ పేర్కొన్నాడు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని రైతు భూక్య సురేశ్ తనకున్న రెండు ఎకరాల్లో వరి పంటను కోసి కేంద్రానికి తరలించాడు. గతనెల 29న నిర్వాహకులు తూకం వేసిన 101 ధాన్యం బస్తాలను కేంద్రంలోనే నిల్వ చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు అందులో నుంచి 10 సంచులను ఎత్తుకెళ్లారు. ధాన్యం తరలింపులో జాప్యం వల్ల తన ధాన్యం బస్తాలను అపహరించుకుపోయారని బాధిత రైతు సురేశ్ ఆవేదన వ్యక్తం చేశాడు.

అధికారులు స్పందించి కేంద్రంలోని ధాన్యం బస్తాలను తరలించడంతో పాటు చోరీకి గురైన ధాన్యం సంచులపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరాడు.

## ద్విచక్ర వాహనానికి సైడ్ ఇవ్వలేదని.. బస్సు డ్రైవర్‌పై దాడికి యత్నించిన యువకుడు

వేములవాడ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం సేవించిన యువకుడు తన ద్విచక్ర వాహనానికి సైడ్ ఇవ్వలేదని ఏకంగా ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడికి యత్నించిన సంఘటన వేముల వాడలో శుక్రవారం చోటుచేసుకుంది. వేములవాడ ఆర్టీసీ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జగిత్యాల నుంచి మొదటి బైపాస్ మీదుగా వేములవాడ బస్టాండ్ వైపు వస్తోంది. ప్రయాణికులను దింపుతూ వస్తుండగా ఎక్కడపడితే అక్కడ బస్సు ఆపుతూ తన ద్విచక్ర వాహనానికి సైడ్‌ఇవ్వడం లేదని ఓ యువకుడు ఆగ్రహం చెందాడు. ఏకంగా రోడ్డుకు అడ్డంగా తన ద్విచక్రవాహనాన్ని నిలిపి ఆర్టీసీ బస్సును అడ్డుకున్నాడు.

బస్సు డోర్ వద్దకు చేరుకొని డ్రైవర్, కండక్టర్లపై తిట్ల పురాణం అందుకోవడమే కాకుండా దాడికి యత్నించాడు. సంఘటనను చిత్రీకరిస్తున్న ప్రయాణికులను సైతంతిట్టి సెల్‌ఫోన్ లాక్కునేందుకు ప్రయత్నించాడు. ఈ సంఘటనతో ప్రయాణికులు భయాందోళనచెందగా పోలీసులకు సమాచారం అందించారు. ఈమేరకు జరిగిన సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. ఇటీవల ఆర్టీసీ డ్రైవర్‌పై దాడిచేసిన సంఘటన మరవకముందే వేములవాడ ఆర్టీసీ అద్దెబస్సు డ్రైవర్‌పై ఆ యువకుడు వ్యవహరించిన తీరుతో ఆర్టీసీ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

## కన్నుల పండువగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోరుట్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తాళ్ల చెరువు ప్రాంతంలోని గుంటి పురుమాండ్ల రథోత్సవం శుక్రవారం కన్నుల పండువగా సాగింది. దేవాలయంలో వేద పండితులు శంకర్ శర్మ, పణీంద్ర శర్మ, ఆరుణ్ శర్మ, కాశిక్ చారి, సునిల్‌ల మత్రోత్సరణ మధ్య ప్రత్యేక పూజలను నిర్వహించారు. దేవాలయంలో మూల విరాట్‌కు అర్చన అభిషేకాలను జరిపారు. ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవ మూర్తులను రథంలో ఉంచి రతోత్సవంను నిర్వహించారు. రథోత్సవంలో ఉన్న స్వామిని దేవాలయం చుట్ట ప్రదక్షణను నిర్వహించిన భక్తులు రథం లాగీ మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావుతో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఖీన్‌పూర్, కోరుట్ల పట్టణంకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

## తెలంగాణ అండర్-19 చెస్ జట్టుకు కోచ్‌గా అనూప్ కుమార్



అనూప్ కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బెంగుళూరులో ఈ నెల 5 నుంచి 7 వరకు జరగనున్న 69వ కళాశాలల అండర్-19 జాతీయ స్థాయి చెస్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టుకు జిల్లాకు చెందిన కంకటి అనూప్ కుమార్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. గతంలో పలుమార్లు తెలంగాణ చెస్ జట్టుకు కోచ్‌గా వ్యవహరించిన అనూప్ అండర్-19 జట్టుకు కూడా కోచ్‌గా వ్యవహరించడం విశేషం. ఈ సందర్భంగా అనూప్‌కు జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఒలంపిక్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి వేణుగోపాల్ తదితరులు అభినందించారు.



# పోలీసులకు సమాంతరంగా సేవలు

## అయినా గుర్తింపునకు నోచుకోని హోంగార్డులు

- ఉద్యోగ భద్రత, హెల్త్‌కార్డు, కారుణ్య నియామకాల కోసం దీర్ఘకాల పోరాటం...
- నేడు హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలీసులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారు. పోలీసులతో సమానంగా తమకు గుర్తింపు లభించటం లేదని హోంగార్డులు వాపోతున్నారు. పోలీసు శాఖకు అనుబంధంగా పని చేస్తున్న హోంగార్డులు దీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను ఇటు ప్రభుత్వం అటు పోలీసు శాఖలు పరిష్కరించలేక పోవడంతో నిర్లక్ష్యానికి గురవుతున్నారు. పోలీసులు నిర్వహించే ట్రాఫిక్, సివిల్ విధులతోపాటు అధికారుల వాహనాలకు డ్రైవర్లుగా, పోలీసు కార్యాలయాల వద్ద విధులను హోంగార్డులు సమర్ధవంతంగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం హోంగార్డుల సమస్యలు పరిష్కరించకుండా వెట్టి చాకిరి వ్యవస్థగానే చూస్తున్నదనే విమర్శలు వస్తున్నాయి. గత ఏడాది సీఎం కేసీఆర్ హోంగార్డుల వేతనాలను తొమ్మిది వేల నుంచి 12 వేలకు పెంచారు. పనికి తగిన వేతనం లభించడంలేదనే అసంతృప్తి హోంగార్డులో నెలకొన్నది.

**స్వచ్ఛంద సంస్థగా ఆవిర్భవించి..**

హోంగార్డుల వ్యవస్థ దేశ సరిహద్దుల్లో 1959లో పోలీసులకు చేదోడు వాదోడుగా ఉండేందుకు స్వచ్ఛంద దళంగా ఆవిర్భవించింది. కాలక్రమేణా పోలీస్ శాఖకు అనుబంధంగా కొనసాగిస్తూ 1983లో హోంగార్డులకు దినసరి వేతనాలు అందజేశారు. ఆ తరువాత నెలసరి వేతనాలు చెల్లిస్తున్నారు. ఉద్యోగం శాశ్వతం కాక పోవడంతోపాటు రోజు రోజుకు పెరుగుతున్న ఖర్చులతో ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలు సరిపోవడం లేదని హోంగార్డులు వాపోతున్నారు. పోలీసు శాఖతోపాటు అగ్నిమాపకశాఖ, రవాణాశాఖ, కోర్టు, ఆర్టీసీ తదితర ప్రభుత్వ శాఖల్లో హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి రోజువారి గౌరవ వేతనం వెయ్యి రూపాయలు ఇస్తారు. ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులకు అదనంగా 30 శాతం అలవెన్స్ వస్తుంది. పదవీ విరమణ పొందిన హోంగార్డులకు ఎలాంటి ఆర్థిక సహకారం లభించడం లేదు. 30 సం వత్సరాల సర్వీసు పూర్తి చేసి, ఖాళీ చేతులతో ఇంటికి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జరగబోయే 63వ హోంగార్డ్ ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని డీజీపీ ఉత్తర్వులు ఇవ్వడంతో హోంగార్డులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 1,127 మంది హోంగార్డులు ఉన్నారు.

**ప్రధాన డిమాండ్లు**

- 2017 ఎస్‌పీఏ ఉత్తర్వులను అమలు చేసి హోంగార్డులకు ఉద్యోగ భద్రత కల్పించాలి.
- మరణించిన హోంగార్డు కుటుంబాలకు కారుణ్య నియామకాలు కింద ఉద్యోగ సౌకర్యం కల్పించాలి.
- 2025 సంవత్సరంలో మరణించిన హోంగార్డు కుటుంబాలకు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఐదు లక్షల రూపాయలు అందజేయాలి.
- హోంగార్డులకు ఆరోగ్య భద్రత కార్డు సౌకర్యం కల్పించాలి.
- పెండింగ్‌లో ఉన్న యూనిఫాం అలవెన్స్ నిధులు విడుదల చేయాలి.
- పదవీ విరమణ పొందిన హోంగార్డులను రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా సహాయ సహకారాలు అందించాలి.
- కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో ఎక్స్ సర్వీస్‌మెన్‌కు ఇచ్చిన సడలింపులు హోంగార్డులకు ఇవ్వాలి.
- వేతనంలో కోత లేకుండా వారంలో ఒక సెలవు ఇవ్వాలి
- మహిళా హోంగార్డులకు ఒక నెల వేతనంతో కూడిన ప్రసూతి సెలవు కల్పించాలి.
- ఐదు సంవత్సరాల సర్వీసు కలిగిన హోంగార్డులకు కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పించి శిక్షణ ఇవ్వాలి.
- కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపికలో 30 శాతం హోంగార్డులకు రిజర్వేషన్ కల్పించాలి.

## విదేశాల్లో ఉన్నత విద్యపై అవగాహన తరగతులు

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉన్నత విద్య చదివేందుకు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ లాంగ్వేజ్‌పై ట్రైనింగ్ క్లాసులకు దరఖాస్తులు కోరుతున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. విదేశాల్లో ఉన్నత విద్య చదవడంతో పాటు స్కాలర్‌షిప్‌లు పొందడానికి అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు ఉమ్మడి కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన డిగ్రీ పూర్తి చేసిన వారు ఈ నెల 21 వరకు టీజీ బీసీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 040-24071178, 0878- 2268686 నెంబర్లలో ఆఫీసు సమయాల్లో సంప్రదించాలని ఆయన కోరారు.

## రేపు ట్రాన్స్‌కో సర్కిల్ క్రికెట్ జట్టు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కరీంనగర్ ట్రాన్స్‌కో సర్కిల్ క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను ఆదివారం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ నెట్స్‌లో ఉదయం 9 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రతినిధులు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులను ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి ట్రాన్స్‌కో డిస్కమ్స్ ఇంటర్ సర్కిల్ పోటీలకు ఎంపిక చేయనున్నామని పేర్కొన్నారు.

## నాందేడ్ నుంచి కొల్లాం ప్రత్యేక రైలు

- ఫలించిన మంత్రి అడ్లూరి కృషి

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నాందేడ్ నుంచి జగిత్యాల మీదుగా అయ్యప్పస్వాముల కోసం ప్రత్యేక రైలు నడపాలని కోరుతూ రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ సెక్రటరీ బోగోజీ ముఖేష్ ఖన్నా రైల్వే అధికారులు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు విన్నవించారు. స్పందించిన మంత్రి దక్షిణ మధ్య రైల్వే జీఎంతో మాట్లాడి ప్రత్యేక రైలును ఏర్పాటు చేయించారు. డిసెంబరు 24, జనవరి 7 తేదీల్లో నాందేడ్ నుంచి కొల్లం వరకు(శబరిమల) ప్రత్యేక రైలు అందుబాటులో ఉండనుంది.

## సీసీఎల్ఏ భూముల రిజిస్ట్రేషన్ పకడ్బందీగా నిర్వహించాలి

- దేవాదాయశాఖ ఉప కమిషనర్ సునీత

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 5: దేవాదాయశాఖకు చెందిన సీసీఎల్ఏ (చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) భూముల రిజిస్ట్రేషన్ పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్, వరంగల్ జోన్ ఉప కమిషనర్ సునీత సూచించారు. శుక్రవారం ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పలు సూచనలు చేశారు. రాష్ట్ర కమిషనర్, ఉప కమిషనర్ ఈ విషయంలో స్పష్టమైన ఆదేశాలిచ్చారని అన్నారు. ఆలయాల భూములు 43వ సెక్షన్ కింద రిజిస్ట్రేషన్ చేసే ముందు పూర్వ రికార్డులైన కాస్ర, సేతువర్, చెస్ల వంటి వాటిని సేకరించి వాటిలో సర్వే నెంబర్లు ధ్రువీకరణ చేయాలని తెలిపారు. వివరాలను 22-ఏ(ఐ)సి ప్రొఫార్మాలో నమోదు చేసి రికార్డులను రాష్ట్ర కమిషనర్ కార్యాలయానికి పంపాలని పేర్కొన్నారు. సమావేశంలో ఉమ్మడి జిలా సహాయ కమిషనర్ నాయిని సుప్రియ, ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్లు, కార్యనిర్వహణాధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉప కమిషనర్ సునీత

## నామినేషన్‌ను అనుమతించండి

- కోర్టును ఆశ్రయించిన అభ్యర్థి

వైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ అభ్యర్థిగా తన నామినేషన్‌ను అధికారులు తిరస్కరించడంతో రామగిరి మండలం పెద్దపేట సర్పంచ్ అభ్యర్థి చింతపట్ల సుహాసిని హైకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 29న సర్పంచ్ అభ్యర్థిగా సుహాసిని నామినేషన్ దాఖలు చేశారు. నామినేషను తీసుకున్న అధికారులు గత నెల 30న జరిగిన నామినేషన్ల పరిశీలనలో ఆమె పేరు గ్రామ ఓటర్ల జాబితాలో లేకపోవడంతో నామినేషన్‌ను తిరస్కరించారు. కాగా తన కుటుంబ సభ్యుల పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయని, తన ఓటు గల్లంతు అయిందని తనకు సర్పంచ్‌గా పోటీ చేసే అవకాశం కల్పిస్తూ నామినేషన్‌ను ఆమోదించాలని కోరుతూ సుహాసిని హైకోర్టును ఆశ్రయించారు.

**అసత్య ప్రచారాలు వ్యాప్తి చేస్తే చర్యలు**

పెద్దపేట గ్రామ సర్పంచ్ ఎన్నికల విషయంలో సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతున్నట్టు తమకు ఎటువంటి కోర్టు ఆదేశాలు అందలేదని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రకటనలో పేర్కొన్నారు. అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

## ఆర్టీసీ స్థలంలో ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకున్న కాలనీవాసులు

కోరుట్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ స్థలంలో అధికారులు నిర్మిస్తున్న ప్రహరీ నిర్మాణంపై రగడ మొదలైంది. ప్రహరీ నిర్మాణంపై చుట్టు పక్కల కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేయ్యడంతో నిర్మాణం వివాదాస్పదంగా మారింది. కోరుట్ల ఆర్టీసీ డిపోకు చెందిన ఎకరం ఇరవై గుంటల స్థలంలో ఇటీవల కొందరు స్థలం మాదంటూ మట్టి పోసి చదను చేసిన విషయం తెలిసిందే. స్థల ఆక్రమనకు పాల్పడిన వారిపై డిపో అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం కోరుట్ల ఆర్‌టీసీ డిపో మేనేజర్ మనోహర్ ఆధ్వర్యంలో ఆర్‌టీసీ అధికారులు ఆ స్థలంలో రాళ్లతో హద్దులను ఏర్పాటు చేసారు. ఆర్‌టీసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థల పరిరక్షణ కోసం ప్రహరీ నిర్మాణం చేపట్టారు. విషయం తెలుసుకున్న చుట్ట పక్కల కాలనీ వాసులు అక్కడకు చేరుకుని పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 40 సంవత్సరాల నుంచి ఈ ప్రాంతం నుంచి రాకపోకలు జరుగుతున్నాయని అన్నారు. రోడ్డుకు స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు డీఎం మనోహర్‌కు వినతిపత్రం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చిరంజీవి అక్కడి చేరుకుని కాలనీవాసులను సముదాయించారు.



డిపో మేనేజర్‌తో మాట్లాడుతున్న కాలనీ వాసులు

## సర్పంచ్‌లో బరిలో 80 ఏళ్ల వృద్ధురాలు

- జనరల్ మహిళ రిజర్వు
- ఉప్పట్ల పోటీలో అందరూ ఎస్సీ మహిళలే

మంథని, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పట్ల గ్రామ పంచాయతీ ఎన్నికలు రాజకీయంగా చర్చనీయాశంగా మారాయి. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీల కోసం అంతా యువతా ఉత్సాహం చూపుతుండగా.. వారి కంటే నేనేం తక్కువ కాదంటూ.. ఉప్పట్ల గ్రామ సర్పంచ్‌గా కాసిపేట వెంకటమ్మ అనే వృద్ధురాలు నామినేషన్ దాఖలు చేశారు. 80 ఏళ్ల వయస్సులో సైతం గ్రామ ప్రజలకు సేవ చేయటానికి ముందుకు వచ్చిన వెంకటమ్మను అందరూ అభినందిస్తున్నారు. ఉప్పట్ల గ్రామ సర్పంచ్ పదవి జనరల్ మహిళకు రిజర్వు కాగా ప్రస్తుతం సర్పంచ్ పోటీలో ఉన్న ముగ్గురు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారే ఉండటం గమన్హారం. గ్రామంలోని 8 వార్డుల్లో 4 వార్డులు జనరల్‌గా రిజర్వు కాగా, మరో నాలుగు ఎస్సీలకు రిజర్వు అయ్యాయి.

అయితే మొత్తం 8 స్థానాల్లో సైతం ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారే పోటీలో ఉండటం చర్చనీయాంశంగా మారింది.



సర్పంచ్‌గా పోటీ చేస్తున్న కాసిపేట వెంకటమ్మ

## దత్తాత్రేయ స్వామి ఆలయంలో మంత్రి పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న మంత్రి పొన్నం, విప్ ఆది శ్రీనివాస్



స్పీడ్ బోట్‌లో స్వామి దర్శనానికి వెళ్తున్న మంత్రి, విప్

బోయినపల్లి, డిసెంబర్, 5 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని శ్రీ దత్తాత్రేయ స్వామివారిని వేడుకున్నట్లు రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బోయినపల్లి మండలంలోని వరదవెల్లి గ్రామంలోని శ్రీ దత్తాత్రేయ స్వామి గుట్టపై జరుగుతున్న దత్త జయంతి ఉత్సవాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పీడ్ బోట్‌లో మంత్రి పొన్నం, విప్ ఆది గుట్టపై చేరుకున్నారు. సందర్భంగా దత్తాత్రేయ స్వామి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.మంత్రి పొన్నం ప్రభాకర్ విప్ ఆది శ్రీనివాస్‌లకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి చిత్రపటాలను, ప్రసాదాలను ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దత్త జయంతి ఉత్సవాల సమయంలోనే కాకుండా ప్రతి రోజు దర్శనం కోసం బోట్ సౌకర్యం కల్పిస్తామన్నారు. అనంతరం విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవాలకు ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ ముదుగంటి సురేందర్ రెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, ఏఎంసీ ఛైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు కుస రవీందర్, మండల పార్టీ అధ్యక్షులు వెన్నెల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రూ.7,300 పలికిన పత్తి ధర

జమ్మికుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7300 పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 50మంది రైతులు 464 క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7300, కనిష్ఠ ధర రూ.6400 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. పత్తి కొనుగోళ్లను వ్యవసాయ మార్కెట్ ఇన్‌చార్జి రాజు దగ్గరుండి పర్యవేక్షించారు. శని, ఆదివారాలు సాధారణ సెలవుదినాలు కాగా, సోమవారం తిరిగి పత్తి క్రయవిక్రయాలు ప్రారంభం కానున్నాయి.

## చిల్లర నాణేలతో నామినేషన్

ఇల్లందకుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా మారపెల్లి సృజన్‌బాబు వినూత్న రీతిలో శుక్రవారం నామినేషన్ వేశారు. ఇల్లందకుంటలో నామినేషన్ వేసేందుకు అభ్యర్థి సృజన్‌బాబు సాయంత్రం 4గంటలకు కేంద్రానికి చేరుకోగా రిటర్నింగ్ అధికారి 31 టోకెన్ ఇచ్చారు. ఆఖరి టోకెన్ కావడంతో అతను చిల్లర నాణెలు వెయ్యి రూపాయలు ఇచ్చి నామినేషన్ దాఖలు చేశారు. అధికారులు అప్పటికే రాత్రి 10గంటలు కాగా, వాటిని లెక్కించేందుకు కొంత సమయం పట్టింది. ఈ విషయంపై సృజన్‌బాబును అడుగగా రూపాయి విలువ తగ్గలేదని చెప్పేందుకు ఈ నిర్ణయం తీసుకొని నామినేషన్ వేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నట్లు చెప్పారు.



చిల్లర నాణెలను లెక్కిస్తున్న ఎన్నికల సిబ్బంది

# వేములవాడలో భక్తుల రద్దీ



భీమేశ్వరాలయంలో భక్తులు



క్యూలైన్‌లో స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

వేములవాడ టౌన్, డిసెంబరు 05(ఆంధ్రజ్యోతి): వేములవాడ భీమేశ్వరస్వామి దేవస్థానం భక్తజనసంద్రమైంది. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 25వేలకు పైగా భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించారు. వేలాదిమంది భక్తులు తలనీలాలు సమర్పించారు. వేలాదిమంది భక్తులు కోడెల మొక్కులు చెల్లించారు. ఆలయంలో స్వామివారికి భక్తులు అభిషేక పూజలు చేశారు. నిత్యఅన్నదాన సత్రం పై అంతస్థులో కల్యాణం, సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. అనేకమంది భక్తులు స్వామివారికి మహాలింగార్చన, కుంకుమపూజలు, పెద్ద పల్లకి సేవలు, ఆకుల పూజలు చేసి భక్తిప్రపత్తిని చాటారు. అనంతరం భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. రాజరాజేశ్వరస్వామివారిని ఎల్ఈడి స్క్రీన్‌లో దర్శించుకొని తరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఈఈ రాజేష్ క్యూలైన్‌లను పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేశారు.

**బద్దిపోచమ్మకు బోనాలు**

భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్న భక్తులు బద్దిపోచమ్మకు బోనాలు సమర్పించారు. వేలాదిమంది భక్తులతో బద్దిపోచమ్మ ఆలయం రద్దీగా మారింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

## యూనివర్సిటీ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎస్సారార్ విద్యార్థులు



మోతె అనిల్



ఎడ్ల విష్ణువర్ధన్



గుగ్గిళ్ల సంతోష్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల అథ్లెటిక్స్ పోటీలకు నగరంలోని శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు. ఇటీవల శాతవాహన యూనివర్సిటీ స్థాయి క్రాస్‌కంట్రీ, అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు మోతె అనిల్, ఎడ్ల విష్ణువర్ధన్, గుగ్గిళ్ల సంతోష్‌లు హర్యానా రాష్ట్రం రోతక్‌లో దయానంద్ యూనివర్సిటీలో ఫిబ్రవరి 21న జరిగే అఖిల భారత యూనివర్సిటీ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ఇన్‌చార్జి పీడీ డాక్టర్ అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్, టి రాజయ్య, డిగ్రీ కళాశాలల లెక్చరర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, డాక్టర్ మీసాల మల్లారెడ్డి, పడాల తిరుపతి తదితరులు అభినందించారు.

## ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్స్‌పాల్

రామగిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మంథని జేఎన్‌టియూ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14, అండ్ 17 బాలబాలికల బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్స్‌పాల్ విష్ణువర్ధన్, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ కనుంట్ల లక్ష్మన్‌లు ముఖ్యఅతిథిలుగా హాజరై పోటీలను ప్రారంభించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడాకారులు ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ పింగిళి కృష్ణారెడ్డి, కొమురోజు శ్రీనివాస్, విజయ్, ఖాజాబి, నాలుగు జిల్లాలకు చెందిన అండర్ 14, 17బాల బాలికలు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు తరలివెళ్లిన జిల్లా జట్టు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా జట్టు శుక్రవారం బయలుదేరి వెళ్లింది. జట్టులో మహేష్, రాహుల్, స్నిగ్ధరెడ్డి, చందు, భానుప్రకాష్, శ్రీకాంత్, ఉదయ్‌కి రణ్, అభినయ్, అభిషేక్, హర్షవర్ధన్, సాకేత్, శివారెడ్డి, నిఖిల్, రాంచరణ్, వివేక్‌లు ఉండగా, కోచ్‌గా వెంకటేశ్, మేనేజర్‌గా సాగర్ వ్యవహరిస్తున్నారు.

## మంత్రిని కలిసిన డీసీసీ అధ్యక్షుడు శ్రీనివాస్


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న మంత్రి తుమ్మల

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలను స్వీకరించిన సంగీతం శ్రీనివాస్ శుక్రవారం హైదరాబాద్ సచివాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు శ్రీనివాస్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో ఐక్యంగా ఉంటూ వారిని సమన్వయం చేస్తూ రాజన్న జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం కృషి చేయాలని మంత్రి సూచించినట్లు శ్రీనివాస్ తెలిపారు.

## శాంతియుతంగా బీసీ రిజర్వేషన్ సాధన..


సమావేశంలో మాట్లాడుతున్న పొలాస నరేందర్

వేములవాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ సాధనకు ఎవరు బలిదానాలు చేసుకోవద్దని, శాంతియుతంగా పోరాడి వాటాను సాధించుకుందామని బీసీ సాధికారిత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్ సూచించారు. వేములవాడ పట్టణంలోని బీసీ సాధికారిత కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ రిజర్వేషన్ అమలుకాకుండా పన్నుతున్న కుట్రలు, కుతంత్రాలకు విసుగు చెందిన రంగారెడ్డి జిల్లాకు చెందిన సాయి ఈశ్వరచారి హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడటం చాలా బాధకరమన్నారు. ఎవరు కూడా ఆత్మబలిదానాలకు పాల్పడవద్దని, బీసీల న్యాయపరమైన హక్కులు, ఆత్మగౌరవం కోసం సమష్టిగా, శాంతియుత పోరాటాలతో ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో వెంకటేష్, రామస్వామి, రవి, భూమయ్య, సుధాకర్, రాజు, దేవయ్య, గంగారాం, శ్రీనివాస్ జ్ఞానేశ్వర్ తదితరులు ఉన్నారు.

## సాయి ఈశ్వర్‌చారి ఆత్మహత్య బాధాకరం

వేములవాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ సాధన కోసం రంగారెడ్డి జిల్లాకు చెందిన ఈశ్వరచారి ఆత్మబలిదానికి ఒడిగట్టడం బాధాకరమని జాతీయ బీసీ వెల్ఫేర్ జిల్లా అధ్యక్షుడు మ్యాకల పర్శరాము ఒక ప్రకటనలో పేర్కొనానరు. ఈశ్వరచారి కుటుంటానికి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

ఇల్లంతకుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సాయి ఈశ్వరచారి ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీసీ సాధికారిత సంఘ మండల అధ్యక్షుడు గజ్జల రాజశేఖర్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కోసం ప్రాణాలు కోల్పోయిన ఈశ్వరాచారి కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వాలు ఇప్పటికైన స్పందించి బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని కోరారు. బీసీల రిజర్వేషన్ సాధించేంత వరకు ఉద్యమించాలని కోరారు.

## సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ రాహుల్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని గ్రామాల్లోని ప్రజలను చైతన్యవంతులను చేయాలని ఎస్ఐ రాహుల్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు సైబర్ నేరాలపై శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాహుల్‌రెడ్డి మాట్లాడుతూ గుర్తు తెలియని నంబర్ల నుంచి ఫోన్‌కాల్స్ వస్తే స్పందించకూడదన్నారు. అపరిచితుల వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం అందించవద్దన్నారు. సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ రాహుల్‌రెడ్డి అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సైబర్ క్రైం ఇన్‌చార్జి జునైద్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పర్శరాములు, అధ్యాపకులు శ్రీనివాస్, కవిత, సౌమ్య, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు..

## సర్పంచ్ అభ్యర్థులకు బీజేపీ మద్దతు

చందుర్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ బలపరుస్తున్న సర్పంచ్ అభ్యర్థులను పార్టీ మండల అధ్యక్షుడు విజేందర్ ప్రకటించారు. చందుర్తి మండల కేంద్రంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక్కొక్క గ్రామంలో బీజేపీ సర్పంచ్ అభ్యర్థులగా ఇద్దరు ఇద్దరు నామినేషన్లు వెయ్యగా ఈ సమస్యను రాష్ట్ర, జిల్లా నాయకత్వ ప్రత్యేక దృష్టి సారించి అభ్యర్థులను ఎంపిక చేసిందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఆదేశాల మేరకు బీజేపీ బలపర్చిన అభ్యర్థులను ప్రకటించడం జరిగిందన్నారు. చందుర్తి సర్పంచ్ అభ్యర్థిగా సిరికొండ శ్రీనివాస్, బండపల్లి అభ్యర్థిగా తీపిరెడ్డి మనోహర్‌రెడ్డి, మల్యాల అభ్యర్థిగా నేదూరి సునీత, కొత్తపేట అభ్యర్థిగా ఓరళి నరేష్, ననుగుల అభ్యర్థిగా గంగిపల్లి అనిత, రామారావుపల్లె అభ్యర్థిగా నరాగుల వాణి-గంగస్వామి, ఎనగల్ అభ్యర్థిగా పసుల విజయ, నర్సింగపూర్ అభ్యర్థిగా పేరుక గంగరాజులను బీజేపీ సర్పంచ్ అభ్యర్థులుగా బలపరిచినట్లు విజేందర్ తెలిపారు. పార్టీని ఏ ఒక్కరు ధిక్కరించిన చర్యలు తప్పవన్నారు.

## సర్పంచ్ స్థానానికి తోడికోడళ్ల పోటీ

ఇల్లంతకుంట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికలలో సర్పంచ్ పదవిని కైవసం చేసుకోవడానికి తోటికోడళ్ళు అయిన గూడెల్లి స్వప్న, గూడెల్లి శ్యామలలు పోటీకి సై అంటున్నారు. ఇల్లంతకుంట మండలం గూడెపుల్లె గ్రామపంచాయతీ 2019లో ఏర్పాటు అయ్యింది. తొలిసారిగా జనరల్ స్థానానికి కేటాయించడంతో మల్లారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుతామని నిర్ణయించడంతో గూడెల్లి భాస్కర్, గూడెల్లి ప్రవీణ్ అనే స్వంత అన్నదమ్ములు సన్నద్దులు అయ్యారు. అధికారులు ప్రకటించిన రిజర్వేషన్లలో గూడెపుపల్లె గ్రామపంచాయతీ బీసీ మహిళకు కేటాయించారు. దీనితో ఇద్దరు అన్నదమ్ములు తమ భార్యలతో నామినేషన్లు వేయించారు. 308మంది ఓటర్లు, 6వార్డులు ఉన్న గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానం కోసం తోటికోడళ్ళు పోటాపోటీగా భర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఇరువురు అభ్యర్థులు పోటీనుండి తప్పుకునేది లేదంటు గెలుపై ధీమాను వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ బరిలో వీరిద్దరే కాకుండా వీరి బంధువులైన గూడెల్లి సరిత, గూడెల్లి సుజాతలు సైతం నామినేషన్లు వేశారు.

## యూరియా కోసం రైతుల ఎదురుచూపులు


ఎల్లారెడ్డిపేటలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సింగిల్‌విండో గోదాం వద్ద శుక్రవారం రైతులు బారులు తీరారు. గంటల తరబడి ఎరువు కోసం ఎదురుచూశారు. యూరియా వచ్చిందనే సమాచారంతో రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. 900 బస్తాలను రైతులకు పంపిణీ చేశామని ప్యాక్స్ సిబ్బంది పేర్కొన్నారు.

## సామూహిక కుంకుమార్చన..


సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు

తంగళ్లపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సామూహిక నవగ్రహ పూజలు, కుంకుమ అర్చనలు నిర్వహించారు. సాయంత్రం శకటోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పండితులు, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ క్రికెట్ టీం ఎంపిక..


విద్యార్థికి బ్యాట్‌ను ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

తంగళ్లపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండేపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థి నిశాంక్ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రికెట్ టీంకు వైస్‌కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. శుక్రవారం విద్యార్థిని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మామిళ్ల విఠల్, వ్యాయామ ఉపాధ్యాయుడు మొహమ్మద్ హనీఫ్, ఉపాధ్యాయులు అభినందించారు.

# చివరి రోజు నామినేషన్ల వెల్లువ

**- రాత్రి వరకు కొనసాగిన స్వీకరణ - రెండు మండలాల్లో సర్పంచ్‌కు 133, వార్డు స్థానాలకు 457 నామినేషన్లు**


నామినేషన్ల కోసం వేచి ఉన్న మహిళలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో చివరి రోజు నామినేషన్లు వెల్లువెత్తాయి. శుక్రవారం రాత్రి వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగింది. నామినేషన్లు దాఖలు చేసేందుకు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. పోటీ చేసే మహిళలు ఓపిక లేక నేలపై కూర్చున్నారు. పోటీపోటీగా అభ్యర్థులు మద్దతుదారులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. సర్పంచ్, వార్డు స్థానాలకు అభ్యర్థులు వరుసలో నిలబడి నామినేషన్లు వేయాల్సి వచ్చింది. ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ క్లస్టర్ కేంద్రంలో రాత్రి 10 గంటల వరకు నామినేషన్లు వేసేందుకు బారులు తీరారు. వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు రంగంపేట క్లస్టర్ కేంద్రాల్లో రాత్రి 9.30 గంటల వరకు స్వీకరణ ప్రక్రియ కొనసాగింది. ఎల్లారెడ్డిపేట మండలంలో 26 గ్రామ పంచాయతీలు, 226 వార్డు స్థానాలకు సర్పంచ్‌కి 69 నామినేషన్లు, వార్డులకు 274 నామినేషన్లు దాఖలయ్యాయి. సర్పంచ్ స్థానాలకు మొత్తం 172నామినేషన్లు, వార్డు స్థానాలకు 554 నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల అధికారి, ఎంపీడీవో సత్తయ్య తెలిపారు. వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు రంగంపేట క్లస్టర్ కేంద్రాల్లో రాత్రి 9.30 గంటల వరకు నామినేషన్లను స్వీకరించారు. మండలంలో 17 గ్రామపంచాయతీలకు గాను సర్పంచ్‌కి 64 నామినేషన్లు, 132 వార్డులకు 183 నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం సర్పంచ్ స్థానాలకు 108, వార్డు స్థానాలకు 234 నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల అధికారి, ఎంపీడీవో శ్రీలేఖ పేర్కొన్నారు.

### పల్లెల్లో ఏకగ్రీవ మంత్రం..

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో మొత్తం 43 గ్రామపంచాయతీలుండగా మూడు పంచాయతీలకు ఒకే ఒక్కటి నామినేషన్ దాఖలయ్యాయి. ఆ పంచాయతీలు ఏకగ్రీవం కానున్నాయి. అధికారులు ఈనెల 17న అధికారికంగా ప్రకటించే అవకాశాలున్నాయి. ఎల్లారెడ్డిపేట మండలంలో రాగట్లపల్లి, గుంటపల్లిచెరువు తండా, వీర్నపల్లి మండలంలో జవహర్‌లాల్‌నాయక్‌తండాల ప్రజలు సమావేశమై ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. ఒకే నామినేషన్ దాఖలై సర్పంచ్‌లుగా ఎన్నికయ్యే వారు నెత్తెట్ల లస్మయ్య(రాగట్లపల్లి), భూక్య తిరుపతి(గుంటపల్లిచెరువుతండా), భూక్య హంసభాయి(జవహర్‌లాల్‌నాయక్‌తండా)లు. పంచాయతీలకు ఒకే నామినేషన్ దాఖలు చేయడంతో ఆ పల్లె ప్రజలు ఏకగ్రీవ మంత్రం జపించారు.

# నిఘా నీడలో 'పల్లె పోరు'

(5వ పేజీ తరువాయి)

200కు రూ 1300, డీజేకు రూ 2 వేలు, ఎల్‌ఈడీ స్క్రీన్‌కు సైజ్‌ని బట్టి ఒకరోజు కిరాయి రూ 5 వేలు నుంచి 12 వేలు, వాహనంపై ఎల్‌ఈడీ అమర్చితే రూ 8 వేలు నుంచి 20 వేల వరకు చార్జిలు నిర్ణయించారు. వీడియోగ్రాఫర్ కెమెరాతో కలిపి నెలకు రూ 22050, డ్రోన్ కెమెరాకు ఒక రోజు రూ3500, ఆడియో క్యాసెట్ రికార్డు రూ 2500,ఆటోతో రూ 3 వేలు నలుగురైదుగురు కూర్చునే వేదిక రోజుకు రూ 150 నుంచి రూ 2800 వరకు ఉంది. క్లాత్ బ్యానర్లు ఫీట్లలో సైజ్‌ను బట్టి రూ 9 నుంచి రూ 13 వరకు, ఫ్లెక్సీ బ్యానర్లు స్క్వేర్‌ఫీట్ రూ 7, హోర్డింగ్ ఫ్లెక్సీ రూ5 వేల నుంచి రూ 6వేల వరకు ధర నిర్ణయించారు. ఒక బ్యాడ్జీ రేటు రూ 10, పోస్టర్లలో మల్టీకలర్ సంఖ్యను బట్టి రూ 8500 నుంచి 75 వేలు, పూల దండ చిన్నది రూ 50, కలర్ పేపర్లతో రూ 150, పూలతో రూ 400, కరపత్రాలు ఒకటి రూపాయి, శాలువ రూ 50, ప్లకార్డులు రూ 25, జెండాలు రూ 5 నుంచి రూ 18 వరకు, డ్రైవర్‌తో కలిపి కారు, జీపు, టెంపో, ట్రక్, వాహనాల అద్దె రూ 2500, ఇన్నోవా, సూమో రూ 3500, కారు రూ 2 వేలు, మూడు చక్రాల వాహనం రూ850, డీసీఎం వ్యాన్ రూ 3వేలు, మినీ బస్ 25సీట్ల పరిమితి రూ4500, టాటాఏస్ వాహనం రోజుకు రూ 1600, బోలెరో రూ 3000, డీలక్స్ రూ 2200, సాధారణ గది రూ 1200, ఏసీ ఫంక్షన్ హాల్ కుర్చీలతో అర్బన్‌లో రూ 15 వేలు, రూరల్‌లో ఏసీ ఫంక్షన్ హాల్ రూ 10 వేలు, అర్బన్‌లో ఏసీ లేని ఫంక్షన్ హాల్ రూ 8 వేలు, రూరల్‌లో ఏసీ లేని ఫంక్షన్ హాల్ రూ 10 వేలు, టెంట్ బట్టి రూ800, సైడ్‌వాల్స్ రూ 30, కార్పెట్లు రెడ్ రూ 350,పెద్ద సైజ్ గ్రీన్ రూ 600 నిర్ణయించారు. లస్సీ సాఫ్ట్ డ్రింక్ ఒకటి రూ 10, వాటర్ ప్యాకెట్ ఒక రూపాయి, వాటర్ బాటిల్ రూ 20, వాటర్ క్యాన్ 20లీటర్లు రూ10, టీ రూ 5, కాఫీ రూ 10, బ్రేక్‌ఫాస్ట్ రూ 35, వెజిటేబుల్ ప్లేట్ భోజనం రూ 50, నాన్‌వెజిటేబుల్ ప్లేట్ రూ 100, చికెన్ బిర్యానీ రూ 100, మటన్ బిర్యానీ రూ 120, పెద్ద సమోసా ఒకటి రూ 6, చిన్న సమోసా రూ 2, ప్లేట్ మిర్చి, బజ్జీ, పకోడి రూ 20, లెమన్ బియ్యం ప్లేట్ రూ 40 ధరలను నిర్ణయించారు.

### గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా మద్యం నిల్వలు

వేములవాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణాల నుంచి పల్లెల్లోకి మద్యం తరలుతోంది. వేములవాడ నియోజకవర్గంలో మొదటి విడత ఎన్నికల సందర్భంగా సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డుల్లో పోటీలో నిలిచే అభ్యర్థులు ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈనెల 11వ తేదిన మొదటి విడత పోలింగ్ నిర్వహించనుండటంతో గ్రామంలో ఎన్నికల సందడి మొదలైంది. అభ్యర్థులు మద్దతుదారులను కోసం ముందస్తుగానే మద్యం నిల్వలను చేసుకున్నట్లు జోరుగా చర్చ జరుగుతోంది.

### విందులతో మభ్యపెట్టేందుకు యత్నాలు..

మొదటి విడత పంచాయతీ ఎన్నికలు ఈనెల 11వ తేదిన జరగనున్నాయి. పంచాయతీ ఎన్నికలకు మరో ఐదు రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో అభ్యర్థులు ఓటర్లను కాకాపట్టే పనిలో పడ్డారు. ఈ సందర్భంగా అభ్యర్థులు ప్రచారంలో జోరును పెంచారు. తమకు ఓటు వేసే వారు ఎవరు.. ఓటు వేయని వారు ఎవరని విశ్లేషించుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఆర్థికంగా బలంగా ఉన్న అభ్యర్థి పెద్ద మొత్తంలో మద్యాన్ని గ్రామంలో గుట్టు చప్పుడు కాకుండా డంపులు చేసినట్లు తెలుస్తుంది. దీంతో గ్రామాల్లో రాత్రి సమయాల్లో మద్యం ఏరులైపారుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. పల్లెల్లో ఓటర్ల కోసం అభ్యర్థులు చేసే ఆఫర్‌లతో ఎవరు ఇచ్చే విందుకు హజరుకావాలో తేల్చుకోలేక తికమక పడుతున్నట్లు టీ హోటళ్ల వద్ద జోరుగా చర్చ జరుగుతుంది. ఇదీలా ఉండగా బడా బాబులు డబ్బు, మద్యం ఎరగా చూపి ఓటర్లను మభ్యపెడుతూ మచ్చిక చేసుకుంటున్నారని, ఆర్థికంగా బలంగా లేని అభ్యర్థులు మాత్రం గ్రామాల్లో నిల్వ చేసిన మద్యంపై దృష్టిసారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# లైంగిక వేధింపులు జరగకుండా చూడాలి

**జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం**


సిరిసిల్ల అపెరల్ పార్క్‌లో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల్లో పనిచేసే కార్మికులపై లైంగిక వేధింపులు జరగకుండా పరిశ్రమల యజమానులతో పాటు అధికారులు చూడాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం ఆదేశించారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం ప్రతి పని ప్రదేశంలో అంతర్గత కమిటీ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులోని అపరెల్ పార్కులోని పంక్చుయేట్ వరల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో కంపెనీ ప్రతినిధులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ ఆవరణలో అంతర్గత కమిటీ పనితీరును పరిశీలించారు. కార్మికులతో మాట్లాడి వారికి అందుతున్న ప్రయోజనాలు, పని ప్రదేశంలో స్థితిగతుల గురించి పరిశీలించారు. అలాగే మేనేజ్‌మెంట్ సభ్యులతో మాట్లాడి ప్రతి ఒక్కరి హక్కులను కాపాడాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక వాతావరణంలో పని ప్రదేశం ఉండాలని సూచించారు. పని ప్రదేశంలో సరైన భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు మానసిక ఉల్లాసానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే క్రచ్ పిల్లల డేకేర్ సెంటర్‌లో పిల్లలకి అందుతున్న సేవలను లక్ష్మీరాజం పరిశీలించారు.

### ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి


ముస్తాబాద్‌లో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రవికుమార్

ముస్తాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల పరిశీలకులు రవికుమార్ సూచించారు. మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న నామినేషన్ కేంద్రాన్ని శుక్రవారం రవికుమార్ పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ ఎలా నడుస్తోందో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక రైతు వేదికలో ఏర్పాటు చేసిన పోస్టల్ బాలెట్ సహాయక కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లాచ్చలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

### పీవోలకు శిక్షణ

తంగళ్లపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ప్రిసైడింగ్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పోస్టల్ బ్యాలెట్‌బాక్స్‌లను ఏర్పాటు చేశామని ఎంపీడీవో తెలిపారు.

# ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి విధులు


మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రర్వాల్

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగర్వాల్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని రైతు వేదికలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగర్వాల్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో పీవో విధులు కీలకమని అన్నారు. బ్యాలెటు బాక్సులు, పేపర్లు ఇతర సామగ్రిని సరిచూసుకోవాలని అన్నారు. ఎన్నికల సామగ్రిని పంపిణీ కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన వాహనాల్లోనే తరలించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్తు, నీటి వసతితో పాటు ఓటర్లకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు కృషి చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగర్వాల్ అన్నారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్‌బేగం, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవోలు సత్తయ్య, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ మండల అధ్యక్షుడికి పరామర్శ

చందుర్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలో మండల బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మ్యాకల ఎల్లయ్య తండ్రి దేవయ్య ఇటివల మృతి చెందగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ వ్యక్త పరిచారు. ఆయన వెంట నాయకులు గోస్కుల రవి, బొడిగె అనిల్ గౌడ్, ప్రవీణ్, లింగయ్య, దేవయ్య, నగేష్, మల్లయ్య, నిఖిల్, కొమురయ్య తదితరులు ఉన్నారు.

### నామినేషన్ల ఉపసంహరణకు సంప్రదింపులు

ఇల్లంతకుంట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : నామినేషన్లు ఉపసంహరించుకునేలా గ్రామాలలో సంప్రదింపులు కొనసాగుతున్నాయి. మండలంలో 35 సర్పంచ్ స్థానాలు, 294వార్డుసభ్యుల స్థానాల కోసం ఎన్నికలు జరుగనున్నాయి. మూడు రోజులపాటు నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. చిక్కుడువానిపల్లె, తిప్పాపూర్ గ్రామాల సర్పంచ్‌ల స్థానాలకు సింగిల్ నామినేషన్లు దాఖలు కాగా, కేసన్నపల్లె గ్రామానికి భార్యభర్తలు మాత్రమే నామినేషన్లు వేశారు. సర్పంచ్‌ల బరిలో 90మంది అభ్యర్థులు, వార్డుసభ్యుల బరిలో 375మంది ఉన్నారు. ఒకేపార్టీ నుండి ఇద్దరు నామినేషన్లు వేయగా వారితో మండలస్థాయి నాయకులు చర్చలు జరుపుతున్నారు. ఒకరు ఉపసంహరించుకొని మరొకరికి మద్దతుగా నిలువాలని సూచిస్తున్నారు. భవిష్యత్తులో ఏఅవకాశం వచ్చినా కల్పిస్తామని నాయకులు బరోసా ఇస్తున్నారు. మరికొన్ని గ్రామాలలో అభ్యర్థి ఇప్పటి వరకు పెట్టిన ఖర్చులతో పాటు కొంత అదనంగా ఇవ్వడానికి కూడా మొగ్గుచూపుతున్నారు. పత్తికుంటపల్లె, కిష్టరావుపల్లె గ్రామాలలో వార్డుసభ్యుల స్థానాలకు సింగిల్ నామినేషన్లు దాఖలు కాగా సర్పంచ్ స్థానాలకు ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. తక్కువ మంది పోటీపడుతున్న స్థానాలపై నాయకులు గురిపెట్టి ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

# ఆ మూడు గ్రామాల్లో ఏకగ్రీవమే..

గంభీరావుపేట, డిసెంబర్: 5 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలంలో మూడు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కానున్నాయి. మండలంలోని హీరాలాల్ తండా, దేశాయిపేట, లక్ష్మీపూర్ గ్రామాల సర్పంచ్ స్థానాలకు నామినేషన్ చివరి రోజైన శుక్రవారం ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు అయ్యాయి. హీరాలాల్‌తండా సర్పంచ్ స్థానం ఎస్టీ మహిళకు రిజర్వ్‌డ్ కాగ, భూక్య పద్మ ఒక్కరే నామినేషన్ వేశారు. అదే విధంగా దేశాయిపేట గ్రామ సర్పంచ్ స్థానం జనరల్ మహిళ రిజర్వ్‌డ్ కాగ, అక్కడి నుండి కూడ గునుగంటి పద్మ తరఫున ఒక్క నామినేషనే మాత్రమే దాఖలు అయ్యింది. లక్ష్మీపూర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ స్థానం ఎస్టీ జనరల్ కాగ, తేజవత్ అంజయ్య ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఈ మూడు గ్రామాల సర్పంచ్‌లు దాదాపు ఏకగ్రీవమయ్యే అవకాశం ఉంది. కాగా, అధికారికంగా అధికారులు ప్రకటించడమే తరువాయి.

### తొలి ఎన్నికల్లోనే హీరలాల్‌తండ ఏకగ్రీవం

గంభీరావుపేట మండలంలోని నూతనంగా ఏర్పాటైన హీరలాల్‌తండ గ్రామ పంచాయితీ తొలి ఎన్నికల్లోనే ఏకగ్రీవం కానుంది. 279 ఓటర్లు గల ఈ గ్రామ పంచాయితీ సర్పంచ్ స్థానం ఎస్టీ మహిళకు రిజర్వు అయ్యింది. తొలి ఎన్నికల్లోనే నామినేషన్ చివరి రోజైన శుక్రవారం భూక్య పద్మ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఈ మూడు గ్రామ పంచాయితీ సర్పంచ్ స్థానాలు దాదాపు ఏకగ్రీవం అయినట్టే.. నామినేషన్‌ల పరిశీలన, ఉపసంహరణల అనంతరం సోమవారం లేదా మంగళవారం వీరిని అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

### పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ..

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ గడ్డం నగేశ్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు వెంకటాపూర్, హరిదాస్‌నగర్ గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. దాఖలైన నామినేషన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులు ఖర్చులను కొత్త ఖాతాల ద్వారా లావాదేవీలను జరిపేలా చూడాలన్నారు. గుర్తుల కేటాయింపు ప్రకటన, ఖర్చుల వివరాల్లో పొరపాట్లు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు ఏర్పాట్లు చేశామని అడిషనల్ కలెక్టర్ గడ్డం నగేశ్ అన్నారు. వెంట తహసీల్దార్ సుజాత ఉన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలి


మాట్లాడుతున్న ఎస్ఐ రమేష్

చందుర్తి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా గ్రామ ప్రజలు సహకరించాలని ఎస్ఐ రమేష్ అన్నారు. చందుర్తి మండలం మల్యాల,కట్టాలింగంపేట గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలపై ప్రజలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడాతూ గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా పోటీచేసే అభ్యర్థులు, నాయకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు. నాయకులు గాని, అభ్యర్థులు గానీ ఓటర్లను ఓట్లను మాత్రమే కోరాలని, ఎలాంటి బెదిరింపులకు ప్రలోభాలకు పాల్పడడం గురిచేయవద్దని సూచించారు. ఎన్నికల్లో ఎవరైనా ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చట్ట ప్రకారం తగిన చర్యలు తప్పవని ఎన్నికల నిబంధనలు కఠినంగా ఉంటాయని అందరూ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.